''హావ్వ! ఇదెక్కడి చోద్యమే? స్కానింగ్ లో ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించుకోవడం విన్నాముకానీ మగ పిల్లవాడు అని తెలిసీ అబార్షన్ చేయించుకోవడం ఎక్కడా వినలేదు, కనలేదు. అయినా...''

''అత్తయ్యా! ప్లీజ్! నా మాట కాదనకండి నాకు మగపిల్లవాణ్ణి కనడం ఇష్టంలేదు''

# అమ్మాయే పుట్టాలి

— సోమంచి ఉషారాణి

దుఃఖాన్ని దిగ్రమింగుకుంటున్నట్లు పెదవులు వణుకుతున్నాయి. ఛాతీ ఎగిరెగిరి పడుతోంది.

''నువ్వేం మాట్లాడవేరా అబ్బాయ్! నువ్వు మాకు ఒక్కగానొక్క కొడుకువి. నీతో ఈ వంశం అంతరించాల్సిందేనా?'' ఆవిడ గొంతులో అంతులేని ఆవేదన, ఆక్రోశం ఉన్నాయి.

''నేను ఎంత చెప్పినా తన అభిప్రాయం మార్చుకోనంటోంది. ఆమె మనసుకేదో గట్టి దెబ్బ తగిలినట్లుంది. మనం నచ్చజెప్పినా ప్రయోజనం వుంటుందనుకోను'' రాజశేఖరం సాలోచనగా అన్నాడు.

''అమ్మా రాణీ! ఈ ఒక్కసారి నా మాట వినమ్మా! ఆ తరువాత నీ ఇష్టం''

''మావయ్యా! దయచేసి నన్ను ఈ విషయంలో మాత్రం బలవంతం చేయవద్దు. నా మాట వినకపోతే ఈ ఇంట్లో వుండడానికి వీల్లేదు అనేంత సంస్కారహీనులుకారుమీరు. అందుకే నేనింతగా పట్టుబడుతున్నాను'' కన్నీళ్లతో అర్థించింది రాణి.

''అపుత్రస్య గతిర్నాస్తి!'' అన్నారు మన పెద్దలు

''కాదు అత్తయ్యా!'' రాణి ఆవేశంగా అరిచింది. 'పుత్రస్య గతిర్నాస్తి' అనేది నేటి నానుడి! నేను చెప్పే విషయాలు వింటే మీకు నిజానిజాలు తెలియడమేకాక నేనెందుకింత పట్టుబడుతున్నానో అర్థమవుతుంది''

★ ★ ★

''ఏం చేస్తున్నారు?'' శ్వేత అత్తగారిని నిలదీసింది.

''ఉప్మా చేస్తున్నాను'' తల దించుకుని తప్పు చేస్తున్నట్లుగా అంది సావిత్రమ్మ. కోడలికి సంజాయిషీ ఇచ్చుకోవడం, ఆమెతో మాటలుపడడం ఆమెకి పరిపాటే!

''అదే ఎందుకు చేస్తున్నారు? అని అడుగుతున్నాను? మిమ్మల్ని నాకు చెప్పకుండా ఏమీ చేయవద్దని ఎన్నిసార్లు చెప్పాలి? ఇలా ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు వండి తగలేస్తే నెలకి సరిపడ తెచ్చిన సరుకులు పదిరోజులుకూడా రావు. ఇదే ఆఖరిసారి చెప్పడం'' విసురుగా అనేసి అక్కడినుండి వెళ్లిపోయింది.

''మీ మావగారు ఆకలేస్తోంది. టిఫిన్ చేసిపెట్టమని నోరు తెరిచి అడిగారమ్మా!'' అని చెప్పలేకపోయిన తన నిస్సహాయతకు మనసులోనే కుమిలిపోయింది సావిత్రమ్మ.

విశ్వనాథం, సావిత్రిలకు చాలాకాలం పిల్లలు పుట్టలేదు. ఎన్నో నోములు నోచి, ఉపవాసాలు వుండి, కటిక నేలపై పడుకుని, ఎవరు ఏది చెబితే ఆ దేవుళ్లకి మొక్కి చివరకు పండంటి కొడుకుని కని మురిసిపోయారా దంపతులు.

నేలపై నడిస్తే ఎక్కడ కందిపోతాడోనని గుండెలమీద పెట్టుకుని పెంచారు: ఆ తరువాత మరో కొడుకు, కూతురు పుట్టారు. వాళ్లని ఏ లోటూ రాకుండా పెంచారా దంపతులు. వాళ్ల చదువులు, పెళ్లిళ్లు అయ్యేసరికి విశ్వనాథంగారు రిటైరయ్యారు ఫ్లాట్ కొంటామని కొడుకులిద్దరూ ఆయన దగ్గర డబ్బంతా తీసేసుకున్నారు. ఇప్పుడు నెలనెలా ఆయనకి వచ్చే పెన్షన్ తప్ప ఆయన దగ్గర ఆస్తేమీ లేదు.

తమ ఇంటికి డబ్బు ఇచ్చారన్న కృతజ్ఞతయినా లేక కోడళ్ళు ఏదో సణుగుతూనే వుంటారు. కొడుకులు మాట్లాడరు. విశ్వనాథంగారికి గుండెనొప్పి వచ్చింది ఒకసారి. ఆయన రెస్టు తీసుకుంటూ జాగ్రత్తగా వుండాలని చెప్పడంతో ఆయన మరో ఉద్యోగంలోకి వెళ్లలేకపోయారు.


''ఏమండీ టిఫిన్ తీసుకోండి'' సావిత్రమ్మ పిలుపుతో ఆయన ఆలోచనలనుండి బయటపడ్డారు

''నాకు ఆకలి చచ్చిపోయింది సావిత్రీ, తినాలని లేదు'' బాధను అణచుకుంటున్నట్లు అంటున్న భర్తను చూడగానే సావిత్రికి కడుపులోనుండి దుఃఖం తన్నుకువచ్చింది. అయినా భర్తముందు బయటపడక, చాలా సౌమ్యంగా నవ్వుతూ అంది.

''భలేవారే! ఆ పిల్ల మాటలు పట్టించుకుంటే ఎలా? మనమ్మాయి అంటే బాధపడతామా? ఇదీ అంతే! తీసుకోండి''

భార్య ప్రేమగా పెడుతుంటే తినకపోతే, ఆమె మనసు కష్టపడుతుందని తీసుకున్నాడుకానీ ఆయనకి గొంతు దిగలేదు.

''అమ్మాయిని పండక్కి పిలవాలి. కొత్తగా



పెళ్లయింది. వాళ్లత్తగారు వాళ్లనికూడా పిలిస్తే బావుంటుంది. అబ్బాయింతో చెప్పండి'' సావిత్రికి మామూలుగాకూడా సౌమ్యంగా, మెల్లగా మాట్లాడడం అలవాటు. ఆవిడ ఎంత బాధనైనా బయటకు కనబడనివ్వదు.

''అలాగే! ఇదిగో నువ్వు కాస్త తిను. మధ్యాహ్నం అన్నం సరిపోయిందో లేదో!'' అని సగం తిని ప్లేటు భార్యకందించాడు. అసలు ఆమె కడుపునిండా అన్నం తినలేదనే తనకి ఆకలి వేస్తోంది, టిఫిన్ చేయమన్నాడు. ఆవిడ ఏనాడూ నోరుతెరిచి తనకిది కావాలి అని అడగకపోవడంవలనే ఆమెకి ఖరీదైన చీరలు, నగలు ఏవీ కొనిపెట్టలేకపోయాడు.

''విన్నారా వాళ్ల మాటలు? వయసు మీదపడినా ముచ్చట్లకేం కొదవలేదు. పైగా కడుపునిండా తిండి పెట్టడంలేదని ఎలా అంటున్నారో చూశారా? పెద్దకోడలు అరుపులతో తెల్లబోయారు.

''ఛీఛీ! ఎన్నేళ్లు వచ్చినా ఇద్దరికీ సిగ్గులేదు. సంపాదించేవాళ్లకన్నా తినేవాళ్లు ఎక్కువ వున్నప్పుడు కాస్త జాగ్రత్తగా ఖర్చుపెట్టాలన్న ఇంగిత జ్ఞానం వుండక్కర్లా'' పెద్దకొడుకు సత్యం విసుక్కున్నాడు.

అప్పుడే చిన్నకొడుకు శివం, కోడలు శ్వేత ఆఫీసునుండి వచ్చారు. శ్వేతకూడా ఉద్యోగం చేస్తుండడంతో ఆ పిల్లకి తను సంపాదిస్తున్నానని అహంకారం చాలా వుంది.

''అమ్మా! ఈ రోజు నాకొక ఇంక్రిమెంట్ వచ్చింది. స్వీటు తీసుకోమ్మా! నాన్నా! మీరుకూడా '' అని చిన్నకొడుకు స్వీటు ఇచ్చేసరికి పెద్దకొడుకు అన్న మాటలువదిలేసి, నవ్వుతూ తీసుకున్నారు.

అతణ్ణి పక్కకి పిలిచి, ''ఇప్పుడా ముసలాళ్లకు స్వీటు ఎందుకివ్వడం? రేపు ఏ సుగరో వస్తే ఎవడు చాకిరీ చేస్తాడు?'' అంది శ్వేత కోపంగా.

''నీకేమమ్మా? హాయిగా ఉద్యోగానికి పోతావ్? చాకిరీ చేయవలసింది నేనేగా!'' శ్వేత అవగానే ఆదేదో జోక్ అయినట్లు నలుగురూ నవ్వుకుంటుంటే సావిత్రమ్మ, విశ్వనాథంలకి స్వీటు చేదుగా అనిపించి తినలేకపోయారు.

ఆ రాత్రి భోజనాలదగ్గర కూతుర్ని పండక్కి పిలవడం గురించి ప్రస్తావించాడు విశ్వం.

''నాన్నా! మాకు చెప్పడం దేనికి? డబ్బు ఖర్చుపెట్టేది మీరు. వండి వార్చి పెట్టేది అమ్మ. మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి'' అన్నాడు సత్యం. డబ్బు ఖర్చుతో తనకేం సంబంధంలేదని నిర్మొహమాటంగా చెప్పాడు. శ్వేత మూతి తిప్పుకున్నా భర్తమాటలకు లోలోపలే సంతోషించింది. ఆమెకస

లు వాళ్లని ఇంట్లో వుంచుకోవడమే ఇష్టంలేదు. వృద్ధాశ్రమంలో ఎలా చేర్పించాలా అని ఆలోచిస్తోంది. అందుకు తగిన అవకాశం కోసం ఎదురుచూస్తూ వుంటుంది.

'అలా అంటే ఎలారా? నాన్నగారి దగ్గర ఎంత డబ్బుందో మీకు మాత్రం తెలీదా? ఇంటికి ఒక్కగానొక్క ఆడపడుచు. వాళ్ల అత్తగారు వాళ్లందరినీ పిల్చి బట్టలు పెట్టారు." సావిత్రమ్మ నచ్చచెప్ప బోయింది.

"ఊ... ఇవన్నీ ఇంకా ఏమిటమ్మా చాదస్తాలు? ఇవన్నీ డబ్బున్నవాళ్లకి. ఏదో మనకి ఉన్నంతలో వాళ్లిద్దరికీ పెడదాం. రమ్మనండి.

★ ★ ★

ఆ రోజు ఉగాది పండుగ. అందరూ తలస్నానం చేసి ఉగాది పచ్చడి తిని, కాఫీలు త్రాగుతున్నారు.

"అత్తయ్యా! అనవసరమైన ఖర్చు పెట్టకండి. ఏదో ఒక స్వీటు, హాటు కొద్దిగా చేయండి" శ్వేత అథారిటీగా అన్నా మెల్లగా అంది. ఆ మాటలు సావిత్రమ్మ కూతురు చెవిన పడ్డాయి.

"నాన్నా! ఇప్పుడు అప్పుచేసి బట్టలు పెట్టకపోతే ఏమైంది? ఈ అప్పు ఎవడు తీరుస్తాడు? వాళ్లకేమన్నా బట్టలకు కరువా? చాలానే వున్నాయి" సత్యం తండ్రిని మందలించడం కూతురి చెవిన పడకపోలేదు.

"అదేమిట్రా ఇలాంటి బట్టలు తెచ్చావు. బావుండదురా!" విశ్వనాథం చిన్నబుచ్చుకున్నట్లు అన్నాడు.

"మీరిచ్చిన డబ్బుకు ఇంతకన్నా మంచివి రావు. ఇష్టమైతే పెట్టండి. లేకపోతే మానేయండి" విసురుగా అనేసి, లోపలికి వెళ్లి భార్య చేతిలో తళతళా మెరిసిపోయే మంచి ఖరీదైన చీర పెడుతుంటే ఆ ఇంట్లో తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటో, వాళ్ళు అనుభవిస్తున్న బాధ ఏమిటో, వాళ్ల పరిస్థితి, పడుతున్న అవమానాలు, ఏదైనా సలహా చెప్పబోయినా 'మీరు మాకు చెప్పేదేమిటి?' అని తీసిపారేయడం, వెకిలిగా నవ్వుకోవడం ఆ ఇంటి ఆడపడుచుగా ఆమెకి ఆకళింపు చేసుకోవడానికి ఎంతోసేపు పట్టలేదు.

"నాన్నా! నాకు మీరు ఎలాంటి బట్టలు పెట్టినా సంతోషంగా కట్టుకుంటాను. కానీ ఆయనకి ఇలాంటి బట్టలు.. ఆయన్ని అవమానించడమే అవుతుంది. అందుకని ఆయనకి రః డబ్బు ఇచ్చేయండి. నేనిలా అంటున్నందుకు బాధపడవద్దు. ఇంటి ఆడపడుచుగా మీ పరువు, మర్యాదా నామీదకూడా వున్నాయి" అని తండ్రికి కొంత డబ్బిచ్చింది. వాళ్లకి తీసుకోవడం ఇష్టం లేకపోయినా గత్యంతరం లేదు.

ఉగాది అలా గడిచిపోయింది. మర్నాడు కూతుర్నీ, అల్లుణ్ణీ సాగనంపుతుంటే "అమ్మా! మీరు కొన్నాళ్లు మా ఇంటికి రండి. మీకు అన్నయ్యలెంతో నేనూ అంతే!" అందామె. అల్లుడుకూడా ఇద్దరినీ రమ్మని మరీ మరీ చెప్పాడు.

ఆడపడుచు భర్త ఆటో తీసుకురావడానికి వెళ్లగానే "మేము సరిగా తిండిపెట్టడంలేదు, చూడడంలేదని అన్నారా మీ అమ్మా, నాన్నా? అంత ఇదిగా వుంటే వేలకువేలు కట్నం ఇచ్చి పెళ్లిచేశారుగా నీ దగ్గరే వుంచుకో!" అంటూ కయ్యానికి కాలుదువ్వింది శ్వేత.

"ఈ ఫ్లాట్‌కి నాన్నగారూ డబ్బిచ్చారు. ఈ ఇంట్లో వుండే హక్కు వాళ్లకీ వుంది" ఆడపడుచు ఊరుకోలేకపోయింది.

"నీ హద్దుల్లో నువ్వుండు. హక్కులగురించి నాకు చెప్పడానికి నువ్వెవరు?" శ్వేత గయ్యమంది.

"అమ్మా! నాన్నా నాతో వచ్చేయండి" కూతురు కన్నీళ్లతో అంటుంటే, "నువ్వేం బాధపడకమ్మా! మాకిక్కడ బాగానే వుంది" అంది సావిత్రమ్మ. విశ్వనాథంగారికి డైరీ వ్రాసుకోవడం అలవాటని, అందులో ఆయన కష్టసుఖాలు ఏరోజుకారోజు వ్రాసుకుంటారని, అది అనుకోకుండా తను చదివానని ఆమె చెప్పలేదు.

★ ★ ★

"మా అమ్మా, నాన్నా పడే బాధలు చూస్తూ, ఇంతకన్నా అధ్వాన్నంగా తల్లిదండ్రుల్ని అవమానపరుస్తూ, వాళ్లనొక అనవసర వస్తువుగా భావించేవాళ్లనెందరి కథలలో వింటూ ఇంకా కొడుకుని కనమంటారా?" వెక్కిపడుతూ అడిగింది రాణి. అత్తగారు ఆమెని దగ్గరకు తీసుకుని ఓదార్చారు.

"నువ్వు చెప్పింది నిజమేనమ్మా! కానీ అందరూ అలా వుండరుకదా! మీలాంటి కొడుకులూ, కోడళ్లూ వున్నారు. అందుకే మాలాంటి వాళ్లం ఇలా అయినా వున్నాము. అదీకాక భ్రూణహత్య మంచిదికాదు. ఆడయినా మగయినా అభంశుభం తెలియని పసివాళ్లని ఆదిలోనే అంతం చేయడం సమంజసమా చెప్పు"

"ఎలా జరిగేది అలా జరుగుతుంది. పున్నామనరకంనుండి తప్పించేది పుత్రుడంటారు కాబట్టి కొడుకుకోసం ఆత్రపడతారుతప్ప రేపు తమకేదో ఉద్ధరిస్తారని, అంధలం ఎక్కిస్తారని పిల్లల్ని కనరమ్మా!" మామగారు నచ్చచెప్పారు.

"అవును రాణీ! అమ్మా, నాన్నా చెప్పింది నిజమే! వాళ్లమీద ఆశ్యాశలు పెట్టుకోక, మన కర్తవ్యం మనం నెరవేర్చినప్పుడు ఆడయితే ఏమిటి, మగయితే ఏమిటి? నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించు, ఆపై నేనున్నానని శ్రీకృష్ణులవారు గీతలో చెప్పలేదూ?" రాజశేఖరం చెప్పిన తీరుకు వాతావరణం తేలికపడి, అందరూ తృప్తిగా నవ్వారు.




## సెక్యూరిటీ


"మావాడి చుట్టూ 24 గంటలు సెక్యూరిటీ వుంటుంది"

"అలాగా... ఏదైనా ఉన్నతమైన పదవిలో వున్నాడా?"

"లేదు... సెంట్రల్ జైల్లో వున్నాడు".

—డి. క్రిస్టఫర్‌బాబు (మణుగూరు)





## 'రోజా' రోగపట్టు

డాక్టర్ శివప్రసాద్ దర్శకత్వం 'ప్రేమతపస్సు' చిత్రంద్వారా పరిచయం అయిన రోజా ఏ కారణం చేతనో మళ్లీ హీరో రాజేంద్రప్రసాద్‌తోగానీ, దర్శకుడు శివప్రసాద్‌తోగాని యాక్ట్ చేయడం జరుగలేదు. తర్వాత చిత్రం శివప్రసాద్ 'కాన్వాలోకా' పాత ప్రేక్షకులకు విడివడకుండానే పోయింది. మళ్లీ ఇప్పుడు 'టోపీరాజా—స్వీటీరోజా' అనే చిత్రం పాత హీరో పాత డైరెక్టర్‌తో చేస్తుంది.

—సాయిరాం

